క్లుప్తంగా

మద్ది క్షేత్రంలో గీతా పారాయణం



గీతా పారాయణం చేస్తున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో తపన ఫౌండేషన్ సహకారంతో హైందవి సంస్థ ఆధ్వర్యంలో గీతా పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. 500 మంది విద్యార్థులచే పెద్దేవం ఆశ్రమం మాత శ్రీ కృష్ణ నందగిరి విద్యార్థులతో గీతా పారాయణం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ 100 శ్లోకాలతో ప్రత్యేకంగా ఇంగ్లిష్, తెలుగులో ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. తొలుత ఆయన మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ కేఎస్ఎన్ ధనకుమార్, ఎస్ఎస్ఆర్ శర్మ, టి.రామకృష్ణ, ఎస్.నాగమణి పాల్గొన్నారు.

అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెం గ్రామంలోని శ్రీనీలాలమ్మ అమ్మవారి 12వ వార్షిక ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు పూర్ణిమకు గురు స్పందన అవార్డు



ఉపాధ్యాయురాలు బోడా పూర్ణిమను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రాజవరం హైస్కూల్ ఫ్లస్ ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు బోడా పూర్ణిమ 'గురు స్పందన 2023' అవార్డును గెలుచుకున్నారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (ఎస్ఈఐఎఫ్) వారు ఏలూరు అతిథి ఫంక్షన్ హాల్ నందు జరిగిన కార్యక్రమంలో 'గురు స్పందన 2023' అవార్డుతో పూర్ణిమను ఘనంగా సన్మానించారు. మూడేళ్ల వరుసగా పాఠ్య పుస్తకాల రచనలో, ప్రభుత్వం తరఫున తయారు చేసిన స్టడీ మెటీరియల్స్‌లో రచయితగా, రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా అందించిన సేవలకుగాను ఈ అవార్డును అందజేశారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి శ్యాంసుందర్, ఫౌండేషన్ చైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి అవార్డును పూర్ణిమకు అందజేసి సత్కరించారు. జంగారెడ్డిగూడెం హైస్కూల్ హెచ్ఎం లోవకుమారి, పలు జిల్లాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

పోలవరం రూరల్: అటవీ సంరక్షణ సవరణ 2023 చట్టాన్ని రద్దు చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలవరంలోని మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అటవీ సంరక్షణ సవరణ 2023 చట్టం వలన కలిగే నష్టాలను ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుజం రామారావు వివరించారు. పర్యావరణాన్ని, గిరిజనుల జీవితాన్ని విధ్వంసం చేసే ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు, దాడి రాముడు, పెంటారెడ్డి తదితరులు నాయకత్వం వహించారు.

శాశ్వత లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ప్రజా ప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ ఏ.మేరీ గ్రేస్ కుమారి సూచించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలోని అధికారులతో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. శాశ్వత లోక్ అదాలత్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని వివరించారు. విద్య, వైద్యం, పోస్టల్, బీమా, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుద్ధ్యం, బ్యాంకింగ్, ఎన్ఆర్ఈజీఎస్, టెలికం సేవలలో లోపాలపై శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చునన్నారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు అప్పీలు ఉండదని, ఎటువంటి రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై అధికారులు ప్రజలలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు కమ్ముల చంద్రశేఖర్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ద్వారకాతిరుమల: సురక్ష శిబిరంలో వృద్ధురాలిని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, మండల వైద్యాధికారి డాక్టర్ బాలు ప్రకాష్‌కు పలు సూచనలు, సలహాలనిచ్చారు. ఆ తరువాత పలువురు రోగులతో మాట్లాడి శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఖరీదైన వైద్యాన్ని ప్రజల గడప వద్దకు చేర్చామన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి భరోసా కల్పిస్తోందన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి నాణ్యమైన మందులు అందించడంతో పాటు, అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని, అందుకే ఆ పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా పోయాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఏసురత్నం, గ్రామ సర్పంచ్ కస్సే శ్రీహరిరావు, రేగంటి వెంకటేశ్వరరావు, రెడ్డి ప్రసాద్, తోటకూర నాగేశ్వరరావు, గొల్లపల్లి వీర్రాజు, కస్సే రాజారావు, చెలికాని బుల్లియ్య, దాకారపు అగ్గియ్య, జంగా వెంకట కృష్ణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ తదితరులున్నారు.

ప్రజల ఆరోగ్యం పదిలం

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మండల పరిషత్ అధ్యక్షుడు డా బి.రాంబాబు నాయక్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం-1 లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అందరికీ ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని ఎంపీపీ చెప్పారు. నిపుణులైన వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఎం.ఇమ్మానియేలు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఎస్ కాంతారావు, సచివాలయ కన్వీనర్ గఫూర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కూలీలను ప్రభుత్వాలు ఆదుకోవాలి

కొయ్యలగూడెం: రైతులను, రైతు కూలీలను, వలసలు వెళ్లిపోతున్న కూలీలను కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు కోరారు. సోమవారం పరింపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి, సచివాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు తక్కువగా ఉండటం వలన తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో కరువు మండలాలను గుర్తించి ఉపాధి హామీ పనులు ఏర్పాటు చేసి, రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని కోరారు. ఏపీ వ్యవసాయ రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు, సీపీఐ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే బాజీ, నక్క లక్ష్మణరావు, ముఠా కార్మికులు వెలగల రామారావు, మట్ట రామకృష్ణ, ప్రత్తిపాటి గంగరాజు, వెలగా నాని, బొబ్బర నవీన్, పులపాకుల రాంబాబు, పాల్గొన్నారు.

పశువులకూ మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా..



బయ్యనగూడెంలో పశు వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం తమది అనీ, కాబట్టే మనుషులతో పాటు పశువులకు సైతం మెరుగైన వైద్యం అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. సోమవారం బయ్యనగూడెం గ్రామంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. నలభై ఐదు రోజులపాటు ప్రజల ఆరోగ్య రక్షణ కోసం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతగానో విజయవంతమైందని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని పశువులకు సైతం జగనన్న పశు వైద్య సురక్ష నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించినట్లు ఆయన చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పశువులకు అంబులెన్స్ సౌకర్యం కల్పించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. అనంతరం రూ.26 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాలను, రూ.25 లక్షల అంచనాతో నిర్మితమైన సచివాలయ భవనాన్ని, రూ.10 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న డ్రెయినేజీని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బాలరాజు ప్రారంభించారు. జాతీయ ప్రధాన రహదారిపై మెయిన్ సెంటర్లో ఇరువైపులా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణాన్ని కేతవరం అడ్డరోడ్డు వరకు పొడిగించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకి విన్నవించగా దీనిపై స్పందిస్తూ ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబు, సర్పంచుల ఛాంబర్ నియోజకవర్గ అధ్యక్షుడు గేలం త్రివిక్రమ సోమరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుకొండ విగ్నేష్, కె.ధర్మారావు, తొంటా కృష్ణ, ఎం.లక్ష్మీప్రసన్న, తలారి నాగు, అల్లం సూరిబాబు, పూలసరి రాంబాబు, మద్దిపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపు



పార్టీ నేతల సమావేశంలో బస్సు యాత్రపై చర్చిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికారికత బస్సు యాత్ర విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. సోమవారం బయ్యనగూడెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆడిటోరియంలో పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ నేతలతో కలసి ఎమ్మెల్యే చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన బస్సు యాత్ర వచ్చే సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం వంటిదని అన్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు పార్టీలో క్రియాశీలకంగా ఉన్న వ్యక్తులు సామాజిక సంఘాల నేతలను శ్రేణులను యాత్రలో పాల్గొనే విధంగా కృషి చేయాలన్నారు. మరో పది రోజులలో పోలవరం నియోజకవర్గంలో నిర్వహించబోయే బస్సు యాత్ర ప్రణాళికకు నియోజకవర్గస్థాయి సదస్సును త్వరలోనే ఏర్పాటు చేయాల్సిందిగా సమావేశం తీర్మానం చేసింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాసరి విష్ణు, ఆరేటి సత్యనారాయణ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, విప్ గంట శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దూలపల్లి కాంతారావు, ఉపసర్పంచ్‌లు కోరుకొండ లలిత, సంకుకొండ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దశ్యం

చింతలపూడి: రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని సీఐ ఎంపీఎస్ మల్లేశ్వరరావు అన్నారు. పోలీసు అమర వీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక వీకెఎం ఫంక్షన్‌హాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అక్టోబర్ 21వ తేదీకి ఉన్న విశిష్టతను గురించి సీఐ మల్లేశ్వరరావు వివరించారు. పోలీసు అమర వీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజారక్షణకు అంకితమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నిజమైన సేవకులు పోలీసులేనని ప్రజలు నమ్మేలా పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. నేటి యువత పోలీస్ శాఖలో పనిచేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసు అమరవీరులకు జోహార్లర్పిస్తూ నినాదాలు చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న పోలీసు అమర వీరులకు జోహార్లు అర్పించారు. రక్తదాన శిబిరంలో 50 మంది పాల్గొని రక్తదానం చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కె ప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కే ఆజాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న కాలం ఉద్యాన పంటల రైతులదే



అంకాలగూడెంలో నిర్వహించిన రైతు సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి

కొయ్యలగూడెం: రానున్న కాలం ఉద్యాన పంటల వ్యవసాయం చేసే రైతులదేనని ఉద్యాన శాఖ అధికారి పి.ధీరజ్ లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం అంకాలగూడెంలోని భోగలింగేశ్వర రైతు ఉత్పత్తిదారుల సొసైటీ భవనం వద్ద నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు వేసేందుకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకొని రైతులు లబ్ధి పొందాలన్నారు. ముఖ్యంగా వర్జీనియా పంటకు ప్రత్యామ్నాయంగా ఉన్న లాభదాయకమైన వ్యవసాయం గురించి ఆయన రైతులకు అవగాహన కల్పించారు. వివిధ పంటలకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సబ్సిడీపై అధునాతన యాంత్రిక పరికరాలు, రుణ సదుపాయాలు గురించి తెలియజేశారు. సంఘ ఉపాధ్యక్షులు కాసగాని గోఖలే, రైతు ప్రతినిధులు కంచర్ల సత్యనారాయణ, పాదం రాము, మాజీ సర్పంచ్ పి.మునిస్వామి, ఈడిపిగంటి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గంగానమ్మ ఊరేగింపు



ద్వారకాతిరుమల క్షేత్ర పురవీధుల్లో గంగానమ్మ అమ్మవారి ఊరేగింపు



ఆకట్టుకున్న గరగ డప్పుల నృత్యాలు

ద్వారకాతిరుమల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక తూర్పు వీధిలో కొలువైన గంగానమ్మ అమ్మవారి ఊరేగింపు వేడుక సోమవారం క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా జరిగింది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గంగానమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యులు అమ్మవారి ఉత్సవ మూర్తిని నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవ మూర్తికి కమిటీ సభ్యులు, భక్తులు పూజాదికాలను నిర్వహించి, నివేదనలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గరగ డప్పుల నృత్యాలు, శివుడు, శక్తి వేషధారణలు, డీజే సందళ్ల నడుమ అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. రాత్రి పంగిడిగూడెం పోలవరం కాలువలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

8న విద్యాసంస్థల బంద్

జంగారెడ్డిగూడెం: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ముందు ధర్నా చేస్తున్న కార్మిక ఉద్యోగులకు మద్దతుగా నవంబర్ 8వ తేదీన విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు బంద్ పిలుపునిచ్చాయి. సోమవారం జంగారెడ్డిగూడెం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో పీడీఎస్‌యూ, పీవైఎల్, ఏఐవైఎఫ్ సంఘాల సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం, పీవైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబురావు, ఏఐవైఎఫ్ నాయకులు సురేష్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలు, విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున బంద్‌కు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు వై.క్రాంతి, సీహెచ్. శివరాం, టి.రాహుల్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో కుంభా అద్దయ్య

జంగారెడ్డిగూడెం: స్పందనలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కుంభా అద్దయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అద్దయ్య మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించి నిర్ణీత సమయంలోగా వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి సంబంధించి ఫోటోతో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి సోమవారం మండల టీం అర్జీల ఆడిట్ నిర్వహించాలన్నారు. వివిధ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలను అరగంటకు మించి వేచిచూడకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆయన ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 20 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు.

అర్జీల్లో కొన్ని

- ఇంటి స్థలం మంజూరు చేశారని, కాని పట్టా ఇవ్వలేదని, పట్టా ఇప్పించాలని జంగారెడ్డిగూడెంకు చెందిన బొడ్డు రాంబాబు కోరారు.
- వద్దపల్లిలో ఉన్న 1.21 ఎకరాల ప్రభుత్వ భూమిలో చుట్టుపక్కల రైతులు రాకపోకలు సాగిస్తుండగా.. దాకారపు రవి, నాగరాజు అనే వ్యక్తులు ఈ భూమిని రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేయించి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని చర్యలు తీసుకోవాలని మైసన్నగూడెంకు చెందిన పి.మస్తష్ ఫిర్యాదు చేశారు.
- ఒడిస్సాకు చెందిన వారు గిరిజన చట్టాలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మించి, డాబా నిర్వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని వంకావారిగూడెంకు చెందిన తెల్లం హేమంత రాజు కోరారు.
- ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ కాలువ రిజర్వాయర్ కింద ఉన్న ప్రభుత్వ భూమికి సర్వే నిర్వహించి, గుర్తింపు రాళ్లు పాతాలని కొత్తపట్టిసీమకు చెందిన మైగాపుల విజయదుర్గ కోరారు.

కబడ్డీగూడెంలో పోలీస్ తనిఖీలు

ఏలూరు (టూటౌన్): జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి, డీఎస్పీ జి. శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై శుభశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక కబడ్డీగూడెంలో సోమవారం రాత్రి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. నాటుసారా తయారీ, అమ్మకాలను నివారించడం, బెల్ట్ షాపుల్లో అమ్మకాల నివారణకు, రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన ఖైనీ, గుట్కా, వివిధ పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై షాపుల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హానికి కలిగించే పొగాకు ఉత్పత్తులను, నాటుసారా తయారీ అమ్మకాలను అడ్డుకుంటామని తెలిపారు. మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలపై సమాచారాన్ని పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 100, 112 లేదా ఏలూరు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్ 9440796606, ఎస్సై నంబర్ 9381209581 సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

అథ్లెట్ సాహిల్‌కు సన్మానం

ఏలూరు రూరల్: హన్మకొండలో ఇటీవల నిర్వహించిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన కేఎస్ఎస్ సాహిల్‌ను క్రీడాభిమానులు సన్మానించారు. సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్‌మాస్టర్ జిల్లా వీరభద్రరావు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఎం అక్బర్, టి వెంకటేశ్వరరావు, ఎస్‌కే సత్తార్ తదితరులు పాల్గొన్నారు. 16 ఏళ్ల విభాగంలో 100 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్ సాధించడం ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపిందని, కోచ్ ప్రసాద్‌కు శాలువా కప్పి అభినందించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై కౌన్సిల్ సభ్యులు, అధికారులు చర్చించి, తీర్మానించనున్నట్లు చెప్పారు.

బాలికల ఆచూకీ లభ్యం

కుకునూరు: బెస్తగూడెం గ్రామానికి చెందిన బాలికల అదృశ్యంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు వారి ఆచూకీ కనుగొన్నారు. వేలేరుపాడు మండలం శివకాశీపురం కస్తూర్బా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలికలను శనివారం ఉదయం అదే గ్రామానికి చెందిన మహిళ బయటకు తీసుకువెళ్లింది. అప్పటినుంచి బాలికలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలికలను రాజమండ్రిలో గుర్తించి, వారిని స్వగ్రామానికి తీసుకువచ్చారు. అయితే బాలికలు ఎందుకు వెళ్లారు, వారిని ఎవరు తీసుకువెళ్లారు అన్న విషయాలు తెలియాల్సి ఉందని సీఐ శ్రీనివాస్ తెలిపారు. కాగా, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలికల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి వెంటనే వారిని గుర్తించడంలో చురుగ్గా వ్యవహరించినందుకు గాను వేలేరుపాడు ఎస్సై లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ సుకుమార్‌లకు బాలికల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వమిత్వ సర్వేను వినియోగించుకోవాలి

టి.నరసాపురం: ప్రతి ఒక్కరూ స్వమిత్వ సర్వేను వినియోగించుకోవాలని జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా తెలిపారు. బొర్రంపాలెం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వమిత్వ సర్వేలో ప్రతి ఇంటి సరిహద్దులు కొలిచి యజమానికి శాశ్వత హక్కు కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. నిర్దేశించిన సమయంలో స్వమిత్వ సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ కృష్ణ, రామకృష్ణ, వర్మ తదితరులు పాల్గొన్నారు.

కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్

టి.నరసాపురం: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో కరువు నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు డిమాండ్ చేశారు. ఏపుగుంట గ్రామంలో స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వి.వీరబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ కరువు నివారణ చర్యల్లో భాగంగా రైతులకు పంట నష్టపరిహారం చెల్లించడంతో అన్ని రకాల బ్యాంక్ రుణాలు రద్దు చేసి కొత్త అప్పులు ఇవ్వాలి అన్నారు. కరువు వలసలు నివారించడానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు తక్షణమే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీపీకేహెచ్ చిన్న నారాయణ రాజు, సాగిరాజు కృష్ణంరాజు, బచ్చల కళ్యాణ్, కొత్తా మునమ్మ, టి.అన్నపూర్ణ, కురిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏ వద్ద 3కే రన్

బుట్టాయగూడెం: రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) సందర్భంగా మంగళవారం కేఆర్‌పురం ఐటీడీఏ పెరేడ్ గ్రౌండ్‌లో 3కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.45 నిమిషాలకు జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయిచడం జరుగుతుందని చెప్పారు. అనంతరం 3కే రన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏలూరు (టూటౌన్): మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన రాష్ట్ర మోటారు సైకిల్ యాత్ర సోమవారం ఏలూరు చేరుకుంది. రాజమండ్రిలో సోమవారం ఉదయం ప్రారంభమైన మోటారు సైకిల్‌యాత్ర ఏలూరు చేరుకున్న సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు ప్రవేశ పెట్టడం వల్ల రీడర్లు ఉపాధి కోల్పోతున్నారని, వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం స్థానిక విద్యుత్ ఎస్ఈ కార్యాలయానికి చేరుకుని ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు.